

పకడ్బందీగా డేటా ఎంట్రీ

- వీసీలో నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, వనపర్తి, గద్వాల అదనపు కలెక్టర్లు



వీసీలో కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్/వనపర్తి/గద్వాల, న్యూటౌన్ రాజీవ్‌చౌరస్తా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన డేటా ఎంట్రీని పకడ్బందీగా నిర్వహిస్తామని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేపై కలెక్టర్లతో ఆదివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వీసీ ద్వారా సమీక్షించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ దేవసహాయం వీసీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికి 96 శాతం కుటుంబ సర్వే పూర్తైందని తెలిపారు. మొత్తం 2,50,596 నివాసాలుగా గుర్తించగా శనివారం వరకు 2,39,321 నివాసాల్లో సర్వే పూర్తి చేసినట్టు వివరించారు. రానున్న రెండు రోజుల్లో వంద శాతం సర్వేను పూర్తి చేస్తామని తెలిపారు. సర్వే పూర్తైన కుటుంబాలకు సంబంధించిన వివరాల కంప్యూటరీకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతీ వారంలో రెండుసార్లు పాఠశాల, గురుకుల పాఠశాల, హాస్టళ్లను తనతో పాటు అదనపు కలెక్టర్లు కూడా తనిఖీ చేస్తున్నామని తెలియజేశారు. గద్వాల కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావులు వీసీలో మాట్లాడారు. ఇంటింటి సర్వేలో ఎలాంటి పొరబాట్లు తావులేకుండా పూర్తిస్థాయిలో సమాచారం సేకరించి వివరాలను పొందుపరుస్తున్నామని తెలిపారు.

వనపర్తి కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడారు. సర్వే చేస్తున్న సందర్భంలో ఇళ్ల వద్ద అందుబాటులో లేని వారికి, వలస వెళ్లిన వారికి ఫోన్ చేసి వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని ఆయన డిప్యూటీ సీఎంకు తెలిపారు.

రూ.42.23 కోట్లు..

చెత్త పాలు

- ఉమ్మడి జిల్లాలో డంపింగ్ యార్డుల నిర్వహణ గాలికి
- పల్లె ప్రగతిలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున ఉమ్మడి జిల్లాలో 1,690 ఏర్పాటు
- అమలుకాని తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ
- అటకెక్కిన కంపోస్ట్ ఎరువు తయారీ



అయిజ మండలం సింధనూరులో వృథాగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

అయిజ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని గత ప్రభుత్వం 'పల్లెప్రగతి' పేరుతో రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు(డంపింగ్ యార్డు) నిరుపయోగంగా మారాయి. చెత్త సేకరణ ద్వారా కంపోస్టు ఎరువు తయారు చేసి, సంపద సృష్టించాలన్న లక్ష్యం నీరు గారుతోంది. 2021లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున 1,690 పంచాయతీల్లో ఈ షెడ్లను నిర్మించారు. అందుకోసం రూ.42.23 కోట్లు ఖర్చు చేశారు.



మేడికొండలో చెత్త సేకరణ కోసం ఇచ్చిన డబ్బాల్లో నిల్వ ఉంచిన పిండి, జొన్నలు

గ్రామ పంచాయతీకి ఒకటి

మహబూబ్‌నగర్ జిల్లాలోని 439 గ్రామ పంచాయతీల్లో రూ.10.97 కోట్లతో చెత్త సేకరణ డంపింగ్ యార్డును నిర్మించారు. జోగుళాంబ గద్వాల జిల్లాలో రూ.6.37 కోట్లతో 255, నాగర్‌కర్నూల్ జిల్లాలో రూ.11.52 కోట్లతో 461, వనపర్తి జిల్లాలో రూ.6.37 కోట్లతో 255, నారాయణపేట జిల్లాలో రూ.ఏడు కోట్లతో 280 గ్రామ పంచాయితీల్లో వీటిని నిర్మించారు. ఆయా గ్రామ పంచాయతీల్లోని పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్తను ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించే వారు. అయితే తడి, పొడి చెత్తను వేరు చేసి, డంపింగ్ యార్డుల వద్ద ఉన్న షెడ్లలో కంపోస్టు ఎరువు తయారు చేసి ఆదాయం

(మిగతా 6లో)

కనీవినీ ఎరుగని రీతిలో సీఎం రైతు సదస్సు

- ఏడాది పాలనపై సంబురాలు
- వచ్చే నాలుగేళ్లు.. కాంగ్రెస్ పాలన చూస్తారు
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- 30న సీఎం పర్యటన సందర్భంగా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

మహబూబ్‌నగర్, నవంబరు 24: 'రాష్ట్రంలో ప్రజా పాలన అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఈ సందర్భంగా ఈనెల 30న పాలమూరులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు సదస్సును కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలి' అని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సీఎం రాక సందర్భంగా ఆదివారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రితోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రగతి భవన్, సెక్రెటేరియట్‌లోకి ఎవరికీ ప్రవేశం ఉండేదికాదన్నారు. పాలమూరుతోపాటు రాష్ట్రంలోని

(మిగతా 6లో)

సీఎం కొల్లాపూర్ పర్యటన వాయిదా

డిసెంబరు 10న సభ నిర్వహణ

6

ముగిసిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- నాలుగు కేంద్రాల్లో 771 మంది హాజరు

గద్వాలటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలు (ఎన్‌ఎంఎంఎస్)రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని నాలుగు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 785 మందికి గాను 771 మంది విద్యార్థులు హాజరు కాగా మిగతా 14 మంది గైర్హాజరయ్యారు. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన వారికి నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు మొత్తం రూ.48వేలను ఉపకార వేతనం రూపంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తుంది. పరీక్షలు నాలుగు కేంద్రాల్లోనూ సజావుగా నిర్వహించామని జిల్లా పబ్లిక్ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.



గద్వాల ప్రాక్టీసింగ్ హైస్కూలు కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

తండ్రిని చంపిన తనయుడు

వడ్డేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కొడుకు చేతిలో ఓ తండ్రి హతమయ్యాడు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం జగ్గిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉప్పరి చిన్న కృష్ణయ్య (52), ఉప్పరి యుగంధర్ తండ్రి కొడుకులు. కుమారుడు మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగడానికి డబ్బులు కావాలని తండ్రిని అడిగాడు. అయితే తనవద్ద డబ్బులు లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఆవేశానికి లోనైన కుమారుడు యుగంధర్ తండ్రిపై ఈలపీట కట్టెతో మోదడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ నిర్వహించారు.

పుల్లూరు టోల్ ప్లాజా వద్ద కిడ్నాపర్ల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

అలంపూర్‌చౌరస్తా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాలుడిని అపహరించి తీసుకెళ్తున్న కిడ్నాపర్లను జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలో పోలీసులు పట్టుకున్నారు. ఉండవల్లి ఎస్‌ఐ మహేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాదులోని నీలోఫర్ ఆసుపత్రిలో శనివారం ఓ బాలుడు అపహరణకు గురయ్యాడు. కిడ్నాపర్లు కర్నూలు వైపు వెళ్తున్నారని పోలీసులకు సమాచారం అందడంతో గద్వాల పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో అలంపూర్ సీఐ రవిబాబు, ఉండవల్లి ఎస్‌ఐ మహేష్ ఆధ్వర్యంలో మానవపాడు, అలంపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. పుల్లూరు టోల్ ప్లాజా, అలంపూర్ చౌరస్తా, మానవపాడు క్రాస్‌రోడ్డు, పంచలింగాల స్టేజీల వద్ద నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లూరు టోల్‌ప్లాజా వైపు వెళ్తున్న ఒమ్ని వ్యానును తనిఖీ చేశారు. అందులో ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తితో పాటు ముగ్గురు పిల్లలను గుర్తించారు. వారిని అరెస్టు చేసి నాంపల్లి పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కిడ్నాప్ అయిన రెండు నెలల పసికందును తల్లి చెంతకు చేర్చారు. పట్టుబడినవారు అనంతపురానికి చెందిన వెంకటేశ్ భార్య రేణుక అలియాస్ రేష్మ, మరదలు షాహీన్‌బేగంలుగా తెలిసింది.



ఓమ్ని వ్యానులో రెండు నెలల పసిబాలుడితో నిందితురాలు షాహీన్‌బేగం

తప్పుడు సర్టిఫికెట్‌లకు చెక్

- ఆధార్ తరహాలో విద్యార్థులకు అపార్ ఐడీలు
- ఒక్కక్లిక్‌తో విద్యార్థి సమగ్ర సమాచారం
- అపార్ జనరేట్‌లో వనపర్తి జిల్లా చివరి స్థానం
- జిల్లా అధికారుల శ్రద్ధ పెరగాలి



మామిడిమాడ పాఠశాలలో అపార్ సమ్మతి పత్రాలు అందజేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

6

ధాన్యం కొనుగోలుకు అంతా సిద్ధం

- ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో నేటి నుంచి వరి కొనుగోలు
- లక్షా 50 మెట్రిక్ టన్నుల కొనుగోలే లక్ష్యం



కృష్ణానది ఒడ్డున ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

7

సాయిరెడ్డి మృతిపై డీజీపీ స్పందించాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

- సూసైడ్ నోట్‌లో పేర్లున్న సీఎం సోదరులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- బాధిత కుటుంబానికి పరామర్శ

కల్వకుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి స్వగ్రామం, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పొంకుంట్ల సాయిరెడ్డి ఆత్మహత్యపై రాష్ట్ర డీజీపీ తక్షణమే స్పందించి, 108 బీఎన్‌ఎస్ కేసు నమోదు చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మృతుడు సాయిరెడ్డి సూసైడ్ నోట్‌లో పేర్లున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరులపై పీడీ యాక్ట్ నమోదు చేసి, సీఎంపై కార్యాచరణ చేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సాయిరెడ్డి మృతదేహాన్ని డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సాయిరెడ్డి రెండుసార్లు ఏకగ్రీవ సర్పంచ్‌గా పనిచేసిన సీనియర్ నాయకుడని తెలిపారు. అలాంటి వ్యక్తి తన ఇంటి ముందు దారి విషయంలో సీఎం సోదరులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆత్మహత్య చేసుకున్నాడని, పోలీసులు తక్షణమే 108 బీఎన్‌ఎస్ ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తలను సుమోటోగా తీసుకుని బీఆర్‌ఎస్, ఇతరులపై కేసు నమోదు చేస్తున్నారని తెలిపారు. సాయిరెడ్డి తన మృతికి కారణం సీఎం సోదరులేనని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారని, అది సోషల్ మీడియాలో వైరల్ అయినా పోలీసులు ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. సీఎం కుటుంబానికి ఒక న్యాయం, ఇతరులకు వేరొక న్యాయమా అన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎముక జంగయ్య, శ్రీనివాస్‌యాదవ్, విజయ్‌గౌడ్ ఉన్నారు.

కల నెరవేరేనా?

- రూ. 783 కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మాణానికి శంకుస్థాపన
- రిజర్వాయర్లు లేక పూర్తి స్థాయిలో అందని సాగునీరు

రాజోలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదైనా తుమ్మిళ్ల లిఫ్టు రెండో విడత పనులలో భాగంగా రిజర్వాయర్లు నిర్మిస్తారా..? తమ పొలాలకు సాగునీరు అందిస్తారా అని జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం నడిగడ్డ రైతులు ఎదురుచూస్తున్నారు. నడిగడ్డ ప్రాంతంలో ఆర్డీఎస్ కాలువ కింద దాదాపు 55 వేల ఎకరాలకు సాగునీరు అందించడం కోసం గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాజోలి మండలంలోని తుమ్మిళ్ల శివారులోని తుంగభద్ర నది సమీపంలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఇందుకు రూ.783 కోట్ల నిధులు కేటాయించారు. తుమ్మిళ్ల లిఫ్టు మొదటి విడత పనుల్లో భాగంగా 2018 ఎన్నికల ముందు హడావిడిగా రూ. 162 కోట్లు ఖర్చుతో తుంగభద్ర నది నుంచి కాలువ ఏర్పాటు చేసి పంప్‌హౌస్ నుంచి ఆర్డీఎస్ డీ-22 కాల్వలోకి నీరు ఎత్తిపోసే విధంగా పనులు పూర్తి చేశారు. ఎన్నికల అనంతరం మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లిఫ్టు గురించి పట్టించుకోలేదు. సాగు సీజన్‌లో ఈ లిఫ్టు ద్వారా ఆర్డీఎస్ కింద ఉన్న 55 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. అయితే పంటలు సాగు చేసేందుకు నీరు అవసరమయ్యే సమయంలో లిఫ్టు మోటార్లకు నీరు అందక పంటలు ఎండిపోతాయని రైతులు వాపోతున్నారు. నదిలో గరిష్ట నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, 290.50 మీటర్లు ఉంటేనే తుమ్మిళ్ల లిఫ్టుకు నీరు అందుతాయి. అంతకంటే తక్కువ నీటిమట్టం ఉన్నప్పుడు లిఫ్టు మోటర్లకు నీరు అందక, అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు సాగుచేసే పంటలకు నీరు అందించడం కష్టమే అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక తుంగభద్ర నది నుంచి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ప్రతీ ఏటా 16.9 టీఎంసీల నీరు అందాల్సి ఉంది. ఏటా అనుకున్న స్థాయిలో నీటిని వినియోగించుకోలేక పోతున్నారు. తుమ్మిళ్ల లిఫ్టు ద్వారా ఆలోటు తీరుతుందని రైతులు ఆశపడ్డారు. అయినా ఫేజ్-2 పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో విడత పనులకు నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ నిధులతో మల్లమ్మకుంట (0.39 టీఎంసీ), జులకల్ (0.13టీఎంసీ) వల్లూరు (0.49 టీఎంసీ) సామర్థ్యం గల రిజర్వాయర్లు నిర్మించి, లిఫ్టు ద్వారా రిజర్వాయర్లలో నీటిని నింపితే సాగునీరు పుష్కలంగా లభిస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నది నుంచి తుమ్మిళ్ల లిఫ్టుకు నీరు వచ్చే ఇన్‌టెక్ వెల్

భక్తి శ్రద్ధలతో లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చనలో పాల్గొన్న మహిళలు

ఉండవల్లి, నవంబరు 24 (ఆంధ్యజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని బైరాపురం గ్రామం నిత్య భావన ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయంలోని రాజ రాజేశ్వరి అమ్మవారికి ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి బృందం ఆధ్వర్యంలో కుంకుమా ర్చన నిర్వహించి, ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులచే సామూహిక కుంకుమార్చ న చేశారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బాబోయ్ చలి

మహబూబ్‌నగర్ జిల్లాలో చలి పులి చంపేస్తోంది. తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగమంచు చిగురుటాకులా వణికిస్తోంది. చలి నుంచి రక్షణ పొందేందుకు మంటలు కాపుకుంటున్నారు. నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు కురుస్తున్న మంచుతో దారి కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో శనివారం కనిష్ఠంగా 17.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, ఆదివారం 19.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం వేళ వ్యాపారం చేసుకునేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్


మహబూబ్‌నగర్ పట్టణంలో కురుస్తున్న మంచు


మహబూబ్‌నగర్‌లోని గడియారం చౌరస్తాలో స్వెటర్లు వేసుకొని పూలు అమ్ముతున్న మహిళలు


భూత్పూర్ వద్ద తువ్వాలలు కప్పుకొని వెళ్తున్న బాలికలు


మహబూబ్‌నగర్‌లో చలిమంట కాపుకుంటున్న ఓ కుటుంబం

కనీవినీ ఎరుగని రీతిలో..
సీఎం రైతు సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ శాసన సభ్యులు భయంభయంగా గడిపారన్నారు. ఇప్పుడు ఏడాదిగా ఇందిరమ్మ రాజ్యం ప్రజా సామ్య ప్రభుత్వాన్ని ప్రజలు చూస్తున్నారన్నారని అన్నారు. ప్రజలంతా స్వేచ్ఛగా ఉన్నారని, అందుకే ఏడాది పాలనపై పెద్దఎత్తున సంబురాలు, విజయోత్సవాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో అమలు చేస్తున్న పథకాలు ఏ ఒక్కటి ఎత్తివేయకుండా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని తెలిపారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రూ.ఎనిమిది లక్షల కోట్లు అప్పులు చేసి చిప్ప చేతికిచ్చినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. వచ్చే నాలుగేళ్లు, ఆపై ఐదేళ్లు కాంగ్రెస్ పాలన చూస్తారని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వామ్యమై సీఎం సభను గ్రాండ్‌సక్సెస్ చేయాలని కోరారు. ఈనెల 28న ఏర్పాటు చేసే ఎగ్జిబిషన్‌లో 150 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాటి ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. రాష్ట్ర రైతాంగం కూడా పాల్గొంటుందన్నారు.

ఆశామాషీగా తీసుకోవద్దు: చిన్నారెడ్డి

రైతు సదస్సును ఎవరూ ఆశామాషీగా తీసుకోవద్దని, మహబూబ్‌నగర్‌లో సీఎం సభ గొప్పగా జరిగిందని రాష్ట్రమంతా చర్చించుకునేలా ఉండాలని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. మహిళలు కూడా రైతులేనని, మహిళా సంఘాల సభ్యులను సభకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మూడు రోజులు కార్యక్రమాలు: జీఎంఆర్

ఏడాది ప్రజాపాలనను పురస్కరించుకుని జిల్లాలో మూడు రోజులపాటు రైతు అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

150 స్టాళ్లతో ఎగ్జిబిషన్: కలెక్టర్

రైతు సదస్సు సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించి 150 స్టాళ్లతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సదస్సుకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి రైతులు వస్తున్నారని తెలిపారు. సదస్సును రాష్ట్రంలోని 600 రైతు వేదికల ద్వారా రైతులు వీక్షించేలా లైవ్ ప్రోగ్రాం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అదనపు ఎస్పీ ఏ.రాములు, నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, మల్లు నర్సింహారెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, అనిత, వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, చంద్రకుమార్‌గౌడ్, ఎన్‌పీ వెంకటేశ్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

మంత్రి జూపల్లితో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు అమిస్తాపూర్ శివారులో రైతు సదస్సు నిర్వహించనున్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లపై చర్చించారు. స్టేజీ, స్టాళ్ల ఏర్పాటు, రైతులకు కుర్చీలు వంటి విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్టాళ్ల ఏర్పాటుకు హైదరాబాద్ నుంచి పంపించిన నమూనాలను మంత్రికి వివరించారు.

కొల్లాపూర్ పర్యటన వాయిదా

● వచ్చేనెల 10వ తేదీన నిర్వహణ

కొల్లాపూర్ (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 28న నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ పర్యటన వాయిదా పడింది. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో పట్టణంలో నిర్వహించనున్న ఆర్ఐడీ ఉన్నత పాఠశాల, కళాశాల స్వర్ణోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉండింది. కానీ ఈ నెల 30వ తేదీన మహబూబ్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో కొల్లాపూర్ పర్యటన వాయిదా పడినట్లు తెలిసింది. కొల్లాపూర్ నియోజకవర్గకేంద్రంలో వచ్చేనెల 10వ తేదీన పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఆర్ఐడీ స్వర్ణోత్సవాలు యధావిధిగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

రూ.42.23 కోట్లు చెత్త పాలు


అయిజ మండలం సింధనూరులో వేరు చేయకుండా ఒకే చోట పారబోసిన తడి, పొడి చెత్త

(మొదటి పేజీ తరువాయి)

సమకూర్చుకోవాలని నిర్ణయించినా ఎక్కడా జరగడం లేదు.

చెత్తబుట్టల కోసం రూ.కోట్లు ఖర్చు

గ్రామ పంచాయతీల్లో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ప్రతీ ఇంటికి రూ.50 నుంచి రూ.70 వరకు వెచ్చించి రెండు డబ్బాలను పంపిణీ చేశారు. వాటికోసం జోగుళాంబ గద్వాల జిల్లాలో 1,67,886 ఇళ్లకు గాను రూ.రెండు కోట్ల పైనే ఖర్చు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.10 కోట్లపైనే ఖర్చు చేసినట్లు స్పష్టమౌతోంది. ఆ నిధులన్నీ వృధా అయ్యాయి. రోజూ ఉదయం గ్రామ పంచాయతీ ట్రాక్టర్ చెత్త కోసం ఇళ్ల ముందుకు వచ్చినప్పుడు తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో తెచ్చి పారిశుధ కార్మికులకు అందించాలని నిబంధన విధించారు. అయితే ఇది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. చాలా మంది గృహిణులు ఆ బుట్టలను ఇళ్లలో ఆహార ధాన్యాలు, ఇతరత్రా నిల్వ చేసుకోడానికి వాడుతున్నారు. చెత్తను సంచులు, కవర్లలో తెచ్చి వేస్తున్నారు. గతంలో ఉన్న సర్పంచులు కానీ, కార్యదర్శులు కానీ తడి, పొడి చెత్త బుట్టల నిర్వహణలో జోక్యం చేసుకోకపోవడంతో రెండు కలిపి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.

దృష్టి పెడతాం

గ్రామాలలో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. గతంలో పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి కొంతమేర పని చేయించగలిగాం. ప్రస్తుతం కుల గణన సర్వే తరువాత వాటి నిర్వహణపై దృష్టి పెడతాం.

- శ్యామ్‌సుందర్, డీపీవో, గద్వాల

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

● బైకుకు దారి ఇవ్వలేదని తాగిన మైకంలో కొట్టిన నలుగురు వ్యక్తులు
● చెవిలోంచి కారిన రక్తం.. పోలీసుల అదుపులో నిందితులు

గద్వాల క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు తమ బైకులకు దారి ఇవ్వనందుకు నలుగరు యువకులు తప్పతాగి ఆ తాగిన మైకంలో ఆర్టీసీ డ్రైవర్‌ను దాడి చేసిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూల్ నుంచి గద్వాలకు వస్తున్న ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రంలోకి ప్రవేశించిన క్రమంలో బస్సు వెనుక రెండు బైకులపై ఇద్దరు చొప్పున ఉన్న యువకులు బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించారు. అయితే వెనకాల రెండు బస్సులు వస్తుండటంతో ముందుకు వెళ్లి సైడ్ ఇవ్వగా.. ఓవర్‌టెక్ చేసిన యువకులు బస్సును ఆపి డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ దాడి చేశారు. దాడిలో బస్సు డ్రైవర్ రఫీ ముఖంపై గాయాలు కావడంతో పాటు చెవిలో రక్తం కారింది. దాంతో వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్ఐ మద్యం మత్తులో ఉన్న ఆ యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

చెన్నకేశవ ఆలయంలో కార్తీక పూజలు


చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

బిజినేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామంలో కాకతీయుల కాలంనాటి చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు మాట్లాడుతూ అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ మూర్తులను అశ్వవాహనం మీద గ్రామంలో ఊరేగించారు. ఆంజనేయ స్వామికి సింధూర లేపనం, తమలపాకుల పూజ, మన్యుసూక్త విధాసేవ భక్తులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, భక్తులు, గ్రామస్థులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడి పూజ

తాడూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలోని కొమ్ముగుట్టలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం అయ్యప్ప స్వామి మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పంచామృతాలతో అభిషేకం, మహాపడి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా స్వామియే అయ్యప్ప అన్న నామస్మరణతో మార్మోగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

26న వట్టెం వెంకన్న ఆలయంలో పుష్పయాగం

బిజినేపల్లి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెం వెంకన్న ఆలయంలో ఈనెల 26న కార్తీక బహుళ ఏకాదశి పురస్కరించుకొని పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక సభ్యుడు నందడి ప్రతాప్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పుష్ప యాగం మహోత్సవానికి కైంకర్యులు కూ చకుళ్ల మనోహర్‌రెడ్డి, వసుంధర దంప తులు వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తప్పుడు సర్టిఫికెట్‌లకు చెక్

● ఒక్కక్లిక్‌తో విద్యార్థి సమగ్ర సమాచారం

ఖిల్లాఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తప్పుడు సర్టిఫికెట్‌లకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టింది. ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు కార్డును తెచ్చేందుకు ఆపార్(ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడీ కార్డు జారీ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు విద్యా సంస్థల్లో వన్ నేషన్ వన్ స్టూడెంట్ లక్ష్యంతో 12 అంకెలతో ఆపార్ ఐడీ జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యా శాఖను ఆదేశించింది.

గత విద్యా సంవత్స రం 2023-24 ప్రతీ విద్యార్థికి యూడైస్ ప్లస్‌లో పీఈఎన్ (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్)ను కేటాయించారు.

ఆపార్ ప్రత్యేకతలు

ఆపార్ కార్డులో విద్యార్థులు సాధించిన విజయాలు, మార్కుల వివరాలు, మెమోలు, ఉపకార వేతనాలు, స్పోర్ట్స్ సైన్స్ ఫేర్‌లోని నైపుణ్యాలను సంక్షిప్తంగా నమోదు చేస్తారు. విద్యార్థి జీవితకాలపు గుర్తింపు కార్డుగా ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. విద్యార్థుల సమగ్ర వివరాలను ఒకే ఆధీకృతంగా లభించే విధంగా తయారు చేస్తారు. వివిధ కోర్సుల్లో ప్రవేశాలు, ఉద్యోగాలు పొందే సమయంలో పదే పదే స్టడీ ధ్రువపత్రాలను సమర్పించాల్సిన అవసరం లేకుండా కార్డు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పూర్తి వివరాలు డిస్‌ప్లే అవుతాయి. ప్రవేవ పరీక్షలకు సైతం పూర్తి వివరాలకు బదులు ఆపార్ కార్డు 12 అంకె లను నమోదు చేయాల్సి ఉంటుంది. ఆపార్ కార్డు జారీ చేసే ముందు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సమ్మతి పత్రాలను విద్యా సంస్థల యాజమాన్యాలు తీసుకోవాలి. ప్రతీ విద్యార్థి సమగ్ర సమాచారం ఒక్క క్లిక్‌తో అందుబాటులోకి వస్తుంది. యూడైస్ ప్లస్‌లో ఆధార్ వ్యాలిడేషన్ ఉంటే ఆపార్ జనరేట్ చేయడం సులభంగా మారుతుంది. ఆధార్ కార్డులో, అడ్మిషన్ రిజిస్టర్‌లో, బర్త్ సర్టిఫికెట్‌లో విద్యార్థి పేరు, జెండర్, పుట్టిన తేదీ ఒకే విధంగా ఉంటే ఆపార్ వ్యాలిడేషన్ అవుతుంది. దీంతో రాబోయే రోజుల్లో తప్పుడు స్టడీ పత్రాలకు చెక్ పెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్నత విద్యా సంస్థలు డిగ్రీ, పీజీ , ఎంబీఏ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ విద్యార్థులకు సంబంధించి ఆపార్ జనరేట్ చేయడం వేగవంతంగా కొనసాగుతుంది. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 754 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో 94,188 మంది విద్యార్థుల పేర్లు నమోదు చేశారు. కానీ ఆపార్ నెంబర్లు మాత్రం 100 మంది విద్యార్థులకే జనరేట్ చేయడంతో ఆపార్ నమోదులో వనపర్తి జిల్లా రాష్ట్రంలో చివరి 33వ స్థానంలో నిలిచింది. మంచిర్యాల జిల్లాలో సుమారు ఆరువేల మంది విద్యార్థులకు ఆపార్ జనరేట్ చేసి ప్రథమ స్థానంలో నిలిచింది.


చిట్యాల ఉన్నత పాఠశాల

జిల్లాలో ఆపార్ జనరేట్ వివరాలు

తరగతులు	విద్యార్థుల సంఖ్య	ఆపార్ జనరేట్
ప్రీప్రైమరీ(ఎన్-యూకేజీ)	1379	3
ప్రైమరీ (1-5)	40,497	19
అప్పర్ ప్రైమరీ(6,7,8)	24,632	21
సెకండరీ (9,10)	15,309	53
హయ్యర్ సెకండరీ(11,12)	12,371	4

ఆపార్ సమ్మతి పత్రాలు అందజేశాం



ఆపార్ ఐడీ కార్డు ప్రాముఖ్యతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతో ఆపార్ సమ్మతి పత్రాలను అందజేశాం. విద్యార్థుల చదువుకు సంబంధించి పత్రాలను భద్రపరిచే విధానం బాగుంది. రాబోయే రోజుల్లో విద్యార్థుల ప్రవేశ పరీక్షలకు సంబంధించి పూర్తి వివరాల కోసం ఆపార్ ఎంతగానో ఉపయోగపడుతోంది.

- వెంకటయ్య, విద్యార్థి తండ్రి, మామిడిమాడ

పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్నాం



విద్యార్థుల తల్లిదండ్రులకు ఆపార్ ఐడీపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే పీఈఎన్ నెంబరు రావడంతో విద్యా సంవత్సరం గ్యాప్ ఉండడం లేదు. తల్లిదండ్రులు సైతం సహకరిస్తున్నారు. విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఒక్క క్లిక్‌తో ఆన్‌లైన్‌లో డిస్‌ప్లే అవుతుంది. రాబోయే రోజుల్లో స్టడీ సర్టిఫికెట్ల మోత తగ్గిపోతుంది.

- చెన్నప్ప, జీహెచ్‌ఎం, జడ్పీహెచ్ఎస్ మామిడిమాడ

వన్ నేషన్ .. వన్ స్టూడెంట్



కేంద్ర ప్రభుత్వం వన్‌నేషన్, వన్ స్టూడెంట్ అనే లక్ష్యంతో ఒక్కో విద్యార్థికి 12 అంకెలతో కూడిన జీవిత కాల ఐడీకార్డు అందజేస్తోంది. కార్డును స్కాన్‌చేస్తే విద్యార్థులకు సంబంధించిన స్టడీ పత్రాలు ప్రత్యక్ష మవుతాయి. పదేపదే ధ్రువీకరణ చేయవలసిన అవసరం లేకుండా తప్పుడు పత్రాలకు చెక్ పెట్టే విధంగా ఆపార్ కార్డును కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నది.

- గోవింద రాజులు, డీఈవో, వనపర్తి

గద్దర్ ఆశయాలను కొనసాగిద్దాం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- తెలంగాణ సాంస్కృతిక చైర్‌పర్సన్ వెన్నెల
- కల్వకుర్తిలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ


గద్దర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేసిన అనంతరం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, తెలంగాణ సాంస్కృతిక చైర్మన్ వెన్నెల

కల్వకుర్తి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గద్దర్ విగ్రహం ఏర్పాటుకు ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ గద్దర్ కూతురు వెన్నెల, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గద్దర్ విగ్రహం ఏర్పాటు కమిటీ చైర్మన్, సీనియర్ న్యాయవాది లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో అలరించగా ఎమ్మెల్యే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్ ఆశ యాలకనుగుణంగా పాలన కొనసాగిస్తుందని పేర్కొన్నారు. పేద వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం పని చేస్తున్నట్లు తెలిపారు. గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. తెలంగాణ సాం స్కృతిక సారధి చైర్ పర్సన్, గద్దర్ కూతురు వెన్నెల మాట్లాడుతూ విగ్రహాలు పెట్టడంతో పాటు వారి ఆశయాలను కొనసాగిం చాలని సూచించారు. సమ సమాజ స్థాపన కోసం తన తండ్రి ప్రజా యుద్ధనౌక గద్దర్ చివరి వరకు పోరాడారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆయన ఆశయాల కోసం అహర్నిశలు పని చేస్తున్నారని వెన్నెల పేర్కొన్నారు. తనను గుర్తించి తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, రాములు, శేఖర్, పలువురు నాయకులు ఉన్నారు.

మైసమ్మ దేవత దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

- భక్తి శ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు


నాయినోనిపల్లి మైసమ్మ దేవతను దర్శించుకుంటున్న భక్తులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం నాయినోనిపల్లి గ్రామ శివారులోని మైసమ్మ దేవత దర్శనం కోసం ఆదివారం భక్తుల పోటెత్తారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు రూ.20వేల మంది భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. హుండీ ద్వారా రూ. 76,546, టికెట్ల ద్వారా రూ. 32,200 మొత్తం రూ. 1,08,746 మైసమ్మ ఆలయానికి ఆదాయం వచ్చినట్లు చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఈవో రామేశ్వర్‌శర్మ తెలిపారు.

అమరచింత వాసికి ఉత్తమ సాహితీ ప్రతిభ అవార్డు


ఉత్తమ సాహితీ ప్రతిభ అవార్డు అందుకున్న తిరుమలేష్

అమరచింత, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన వనపర్తి జిల్లా అమరచింత వాసి ఉప్పరి తిరుమలేష్‌కు ఆదివారం ఉత్తమ సాహిత్య సేవా ప్రతిభ అవార్డు లభించింది. ప్రతీ సంవత్సరం కురుమూర్తి దేవస్థానం వారి ఆధ్వర్యంలో అమరచింత సంస్థానం సాహిత్య వారసత్వం కొనసాగింపులో భాగంగా బెల్లం సత్యమ్మ స్మారక ట్రస్టు వారిచే ఉమ్మడి జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను అందజేస్తున్నారు. అమరచింత శ్రీకృష్ణనగర్‌కు చెందిన యువకవి ఉప్పరి తిరుమలేష్ సాహిత్య సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కురుమూర్తి దేవస్థానం వద్ద జరిగిన సభలో ముఖ్య అతిథులుగా అమరచింత సంస్థానాధీశులు శ్రీ రాజా శ్రీరాం భూపాల్, ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, కురుమూర్తి దేవస్థానం పాలక మండలి చైర్మన్ గౌని గోవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బెల్లం సాయిలు యువకవి తిరుమలేష్‌ను సత్కరించి సాహితీ పురస్కారం అందజేశారు.

ఒకే ఏడాదిలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత

- నర్సింహను అభినందించిన గ్రామస్థులు

కోడేరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నరసింహస్వామి అయిదు ఉద్యోగాలకు అర్హత సాధించడంతో గ్రామస్థులు ఆదివారం అతన్ని అభినందించారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నరసింహస్వామి టీజీటీ, పీజీటీ, జేఎల్, టీజీటీ సోషల్, టీజీపీఎస్సీ జేఎల్ ఇంగ్లిష్‌లలో ఉద్యోగాలకు అర్హత సాధించారు. మైలారం గ్రామానికి చెందిన బాలయ్య కుమారుడు ఇష్టంతో శ్రద్ధగా చదివి పేదరికం చదువుకు అడ్డు కాదని నిరూపించారు.

క్రైం కార్నర్

ఇంటి ఆవరణంలోకి కొండచిలువ

- చాకచక్యంగా పట్టుకున్న ఏబీసీడీ సభ్యులు


ఇంటి ఆవరణంలో పట్టుకున్న భారీ కొండ చిలువ

పెద్దమందడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఒక భారీ కొండ చిలువ కలకలం రేపింది. స్థానికంగా ఉంటున్న సాయికుమార్‌రెడ్డి ఇంటి సమీపంలో వైరాగి చెరువు ఉంది. ఆదివారం ఉదయం అందరు చూస్తుండగానే పది అడుగుల కొండచిలువ చెరువులో నుంచి నేరుగా సాయికుమార్‌రెడ్డి ఇంట్లోకి ప్రవేశించింది. అది గమనించిన అతను వనపర్తిలో ఉన్న ఏబీసీడీ(అసోసియేషన్ ఫర్ బయోడైవర్సిటీ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్) సభ్యుడు, సర్ప రక్షకుడు డాక్టర్ బి.సదాశివయ్య శిష్యుడు శివకుమార్‌కు ఫోన్‌లో సమాచారం అందజేశారు. వెంటనే శివకుమార్, అభిరామ్ పామిరెడ్డిపల్లికి చేరుకుని కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. దానిని పట్టుకోగానే గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టుకున్న కొండ చిలువను అటవీ అధికారుల సహాయంతో అటవీ ప్రాంతంలో వదిలేస్తామని తెలిపారు.

గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే


గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

గోపాల్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి కింద పడిన వ్యక్తులను ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆసుపత్రికి తరలించారు. తోటి ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లాకు సమీపంలో ఉన్న పర్ల గ్రామానికి చెందిన సుంకన్న వనపర్తి జిల్లాలో రగ్గులు (దుప్పట్లు) ఆటో పెట్టుకొని అమ్ముతుంటాడు. ఆదివారం గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో రగ్గులు అమ్ముకొని తిరుగు ప్రయాణంలో వనపర్తి-గోపాల్‌పేట వెళ్లే దారిలో జెర్రిపోతుల మైసమ్మ ఆలయం దగ్గర వారు వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో సుంకన్న తలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ శివ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. వనపర్తి నుంచి గోపాల్‌పేటకు వస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రమాదం జరిగిన చోట ఆగి గాయపడిన సుంకన్నను పరామర్శించి దగ్గర ఉండి ఆసుపత్రికి తరలించారు.

అలంపూరు ఆలయ పూజారిపై ఎమ్మెల్యే ఫిర్యాదు

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అలంపూరులోని ఆలయాల పూజారి ఆనంద్ శర్మపై అలంపూరు ఎమ్మెల్యే విజయుడు కర్నూలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే విజయుడు కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలులోని ఆనంద్ థియేటర్‌లోని సినిమాకు వచ్చాడు. ఇదే సినిమాకు పూజారి కూడా వచ్చాడు. సినిమా ముగిసిన తర్వాత ఎమ్మెల్యేను గమనించిన పూజారి ముఖానికి మాస్కు ధరించి ఎమ్మెల్యే ఫొటోలు తీశాడు. దీంతో ఎమ్మెల్యే పూజారిని నిలదీయడంతో గొడవ జరిగింది. ఈ విషయంపై ఎమ్మెల్యే టూటౌన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు పూజారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని మృతుడి వివరాలు లభ్యం

చిన్నంబావి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామ శివారులో పెబ్బేరు ప్రధాన రోడ్డు పక్కన గుంతలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనలో వ్యక్తిని గుర్తించినట్లు ఆదివారం ఏఎస్ఐ రమేష్ తెలిపారు. శనివారం నాడు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడనే విషయమై పత్రికల్లో ప్రచురితం కావడంతో ఆయన కుటుంబ సభ్యులు వనపర్తి సీఐ కృష్ణయ్యను కలిశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పశ్చిమగోదావరి జిల్లా గాంధీనగర్‌కు చెందిన అవ్వారు శేషగా గుర్తించినట్లు పేర్కొన్నారు. మృతిపై అనుమానాలు వ్యక్తం చేయడంతో కేసును విచారిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు అంతా సిద్ధం

- నేటి నుంచి ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో వరి కొనుగోలు
- లక్షా 50 మెట్రిక్ టన్నుల కొనుగోలే లక్ష్యం
- ఐకేపీ ఆధ్వర్యంలో 48 వరి కొనుగోలు కేంద్రాలు
- సింగిల్‌విండో ఆధ్వర్యంలో 16 కేంద్రాలు


అయిజలో తూర్పార పడుతున్న రైతు దంపతులు

అయిజ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరి కొనుగోళ్లలో ఇప్పుడిపుడే వేగం పుంజుకుంటోంది. అడ్డంకులు, ఒడుదుడుకుల మధ్యన ముందుకు సాగేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో వరి కొనుగోళ్లలో సింగిల్‌విండో ప్రధాన పాత్ర పోషించింది. ఈసారి ఐకేపీ రంగప్రవేశం చేసి తన వాటాను పొందింది. జోగుళాంబ జిల్లాలో అలంపూర్ నియోజకవర్గంలో ఆర్డీఎస్, తుంగభద్ర నది ప్రధాన నీటి వనరు కాగా గద్వాల నియోజకవర్గం పరిధిలో జూరాల ప్రధాన నీటి వనరు. వీటి ఆధారంగానే ప్రధానంగా వరి సాగు జరుగుతుంది. ప్రతీ సంవత్సరం ఒక నెల ముందు జూరాల ప్రాజెక్టు పరిధిలో వరి కోతలు ప్రారంభం అవుతాయి. ఒక నెల ఆలస్యంగా ఆర్డీఎస్ పరిధిలో వరి కోతలు జరుగుతాయి. ఈ యేడు సైతం అక్టోబరు చివరిలో జూరాల పరిధిలో కోతలు ప్రారంభం కావటం జరిగింది. నవంబరు చివర్లో ప్రస్తుతం అలంపూర్ నియోజకవర్గంలోని తుంగభద్ర, ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం కోతలు ప్రారంభం అయ్యాయి. అధికారికంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయినప్పటికీ ధాన్యం సోమవారం నుంచి వచ్చే అవకాశం ఉంది. సింగిల్‌విండో, ఐకేపీ, వ్యవసాయ శాఖ అధికారులు పర్యవేక్షణ చేయనున్నారు.

జోగుళాంబ గద్వాల జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలు ఇలా...

జిల్లాలో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలలో జిల్లా మొత్తంగా ఈ ఖరీఫ్ నందు 92,325 ఎకరాలలో వరి సాగు చేశారు. ఇందులో లక్షా 65 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఇందులో దాదాపుగా దొడ్డు, సన్న రకం వరిని లక్షా 50 టన్నులు కొనుగోలు చేస్తామని అధికారులు చెబుతున్నారు. వరి దిగుబడిన చివరి వరకు కొంటామని అధికారులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్‌లో కేంద్రం తన మద్దతు ధరను పెంచింది. ఏ గ్రేడ్ సన్న రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2, 320, బీగ్రేడ్ దొడ్డ రకం ధాన్యానికి రూ.2,300 చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏటా నుంచి సన్న రకం వరి ధాన్యానికి బోనస్ కింద రూ. 500 చెల్లిస్తోంది. జోగుళాంబ గద్వాల జిల్లా మొత్తంగా ఐకేపీ ఆధ్వర్యంలో 48, సింగిల్‌విండో ఆధ్వర్యంలో 16 వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లా మొత్తంగా 64 కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర, బోనస్ చెల్లించి వరి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం గద్వాల నియోజకవర్గంలో కొనుగోళ్లు జరుగుతున్నాయి. అలంపూర్‌లో ప్రారంభించినప్పటికీ కేంద్రాలకు ధాన్యం రావటం లేదు. ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని సంబంధిత అధికారులు తేమను పరిశీలిస్తారు. తేమ 17 ఉంటేనే టోకెన్ అందచేసి కొనుగోలుకు అనుమతినిస్తారు. గన్నీ బ్యాగులపై ఎస్ ఉంటే సన్న రకం, డీ ఉంటే దొడ్డ రకం అని గుర్తులు పెడతారు. కొనుగోలు విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చినా వెంటనే అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకునే అవకాశం కల్పించారు.

ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తాం



ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వరి కొనుగోళ్లు చేస్తున్నాం. కేంద్రం మద్దతు ధర, రాష్ట్ర ప్రభుత్వ బోనస్ డబ్బులు రైతు బ్యాంకు ఖాతాకే జమ కావటం జరుగుతుంది. ఇప్పటికే గద్వాల పరిధిలో కొనుగోళ్లు జరిగిన 4 రోజులలోపే కచ్చితంగా రైతు ఖాతాలో మద్దతు ధర, బోనస్ డబ్బులు జమ చేయటం జరిగింది. అమ్మకాలకు, కొనుగోళ్లకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం రైతులకు అందుబాటులో జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు ధైర్యంగా తమ ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించి తమ సొమ్మును బ్యాంకు ఖాతాలో జమ చేయించుకోవచ్చు. ఎలాంటి ఇబ్బందులు, సమస్య వచ్చిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా కోరుతున్నాం.

- అవుల స్వామికుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

రైతులు చేయాల్సింది ఇలా....

వరి కొనుగోలు కేంద్రాలకు తమ ధాన్యాన్ని తీసుకువచ్చే రైతులు తమతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు 2 జతలు తమ వెంట తీసుకురావాల్సి ఉంది.

రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట

- జాతీయస్థాయి టోర్నీ సత్తాచాటాలి
- రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లాకొత్వాల్
- ఉత్సాహంగా నెట్‌బాల్ జట్ల ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఒబేదుల్లాకొత్వాల్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడలకు కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. త్వరలో దక్షిణ కొరియాలో నిర్వహించనున్న ఏషియాన్ యూత్ మహిళ నెట్‌బాల్ చాంపియన్‌షిప్, ఉత్తరాఖండ్ రాష్ట్రం వచ్చే ఏడాది జనవరి నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర నెట్‌బాల్ జట్ల ఎంపికలను ఆదివారం ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికలను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గాను త్వరలో రాష్ట్రవ్యాప్తంగా సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఫుట్‌బాల్ క్రీడాకారుడని, రాష్ట్ర క్రీడా పాలసీ అమలు చేసేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు నెట్‌బాల్ టోర్నీలో జట్టు విజయం కోసం కృషి చేయాలని క్రీడాకారులను సూచించారు. నెట్‌బాల్ ప్రతినిధులు మాట్లాడుతూ ట్రెడిషన్, ఫాస్ట్ 5 నెట్‌బాల్ మహిళ, పురుషుల, మిక్స్‌డ్ సంయుక్త ఐదు అంశాల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి మహిళ, పురుషుల విభాగంలో మంది ఎంపికలకు హాజరైనట్లు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, నెట్‌బాల్ బాల్ అసోసియేషన్ గౌరవఅధ్యక్షుడు సురేష్‌కుమార్, పర్యవేక్షకులు వైష్ణవి, సునీల్‌కుమార్, నెట్‌బాల్ ప్రతినిధులు సాదత్‌ఖాన్, రాంమోహన్ గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలువాలి

- జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ కురుమూర్తిగౌడ్


మహబూబ్‌నగర్ జిల్లా మహిళా కబడ్డీ జట్టు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలువాలని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తి అన్నారు. హైదరాబాద్‌లో ఎల్‌బీస్టేడియంలో డిసెంబరు 7 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల కబడ్డీ టోర్నీలో పాల్గొనే నూతన మహబూబ్‌నగర్ జిల్లా జట్టు ఎంపికలను ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ కురుమూర్తిగౌడ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది ప్రతిభ చాటి జాతీయస్థాయిలో రాణించారని గుర్తుచేశారు. నవంబరు 30 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. కోశాధికారి ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాల్‌రాజ్, పాపరాయుడు, నర్సింహులు పాల్గొన్నారు.

జట్టు వివరాలు:

జోత్స్న, సంగీత, మౌనిక, శిరీష, పార్వతి, నందిని, గంగా, సింధూజ, ఇందుబాయి, మౌనిక, మనీషా, లక్ష్మి, ఇందుప్రియా, గాయత్రి

దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జిల నియామకం

మహబూబ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఈనెల 29న ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా నవంబరు 29, 2009న కేసీఆర్ దీక్ష చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రతి ఏటా దీక్షాదివస్ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఈ ఏడాది పెద్దఎత్తున చేపట్టాలని భావిస్తోంది. ఇందుకు అన్ని జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్‌కు బీఆర్ఎస్ నాయకుడు క్యామ మల్లేష్, నారాయణపేట జిల్లాకు ఎమ్మెల్సీ కోటిరెడ్డి, గద్వాలకు మాజీ ఎమ్మెల్యే కర్నె ప్రభాకర్‌రెడ్డి, వనపర్తికి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, నాగర్‌కర్నూల్‌కు మాజీ ఎమ్మెల్సీ విజయసింహారెడ్డిలను నియమిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. వీరి ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో దీక్షాదివస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రోడ్డు పక్కన గర్భిణి ప్రసవం

● ఆసుపత్రికి చేర్చిన 102 వాహన పైలట్

ఖిల్లాఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో రోడ్డు పక్కన ఆదివారం గర్భిణీకి ప్రసవం అయింది... దిక్కుతోచని స్థితిలో నిస్సహాయంగా ఉన్న తల్లీ బిడ్డను అదే దారిలో ఇంటికి వెళ్తున్న 102 వాహన పైలట్ రమేష్ మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కోతులకుంట తండాకు చెందిన కేతావత్ వెంకటేష్ భార్య కేతావత్ ఘాల్కికి పురిటి నొప్పులు రావడంతో వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి బయలుదేరారు.

సోలీపూర్ గ్రామ చెరువు కట్ట అలుగు వద్ద ప్రధాన రహదారిపై గర్భిణీకి నొప్పులు అధికమయ్యాయి. దీంతో రోడ్డు పక్కన కిందకు దించడంతో అక్కడే ప్రసవమైంది. అటువైపుగా వెళ్తున్న 102 వాహన పైలట్ డ్రైవర్ రమేష్ తల్లి, బిడ్డ దీనస్థితిని చూసి వెంటనే ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో పాటు మెరుగైన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడంతో తండావాసులు, మండల ప్రజలు రమేష్‌ను అభినందించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని అప్‌గ్రేటెడ్ గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో 2024- 25 విద్యా సంవత్సరంలో పార్ట్‌టైం లెక్చరర్లు, ఉపాధ్యాయులు, పీఈటీ, పీడీల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి పీఎస్ కళ్యాణి తెలిపారు.

ఉమ్మడి జిల్లా పరిధిలోని జడ్చర్ల, మన్ననూరు పీటీజీ, కల్వకుర్తి, అచ్చంపేట, వనపర్తి, కేటీదొడ్డి, కొండాపూర్ గిరిజన జూనియర్ కళాశాలల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్హతలు కలిగినటువంటి అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల జిరాక్సు ప్రతులతో నేరుగా మహబూబ్‌నగర్‌లోని అప్పన్నపల్లి గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాల యందు ఈ నెల 26వ తేదీన నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, అక్కడే డెమో తరగతులు నిర్వహించి ఎంపిక చేయబడునని వివరించారు.

వివరాలకు పైన తెలిపిన కళాశాలల్లో సంప్రదించాలని కోరారు.

జోగుళాంబ ఆలయాలను దర్శించుకున్న రిటైర్డ్ హైకోర్టు జడ్జి


హైకోర్టు రిటైర్డ్ జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

అలంపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అలంపూరు ఐదవ శక్తి పీఠం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామిని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పినాకి చంద్రగోస్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందించి శేష వస్త్రాలతో సత్కరించారు. వీరి వెంట సీఐ రవిబాబు, ఎస్ఐ వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు


అథ్లెటిక్స్ ఎంపికలను ప్రారంభిస్తున్న జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రాజు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో డిసెంబరు 1వ తేదీన నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో పాల్గొనే జిల్లా అండర్-8,10,12 బాల, బాలకల జట్ల ఎంపికలను ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించారు. ఎంపికలను జిల్లా సాఫ్ట్ బాల్ సంఘం అధ్యక్షుడు అమరేందర్‌రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి టోర్నీ ప్రతిభ చాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్, సంయుక్త కార్యదర్శులు రమేష్‌బాబు, శ్రీనివాసులు, మేరిపుష్ప, కోచ్‌లు సాధిక్‌అలీ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

26న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26న ఉమ్మడి జిల్లా అండర్-17 సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మహబూబ్‌నగర్ స్టేడియం మైదానంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాల బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పీడీలు నాగరాజు, రాఘవేందర్‌కు రిపోర్టు చేయాలని కోరారు. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు డిసెంబర్ మొదటి వారంలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొంటుందని తెలిపారు.

జోగుళాంబ ఆలయంలో భక్తుల రద్దీ


అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

అలంపూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాల్లో కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు రావడం చేత రద్దీ నెలకొంది. భక్తులు ఉభయ ఆలయాలను దర్శించుకుని పవిత్ర తుంగభద్ర నది పుష్కరఘాట్‌లో స్నానమాచరించి నదిలో దీపాలను వదిలి స్వామి వారి ఆలయంలో గణపతి పూజ, స్పర్శ దర్శనం అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు చేశారు. మహిళలు అమ్మవారికి చీరలు, గాజులు, వడి బియ్యం, త్రిశతి ఖడ్గమాలలను మొక్కుబడులుగా చెల్లించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఆలయాల ముందు కార్తీక దీపాలను వెలిగించారు.

దొంగతనం చేసిన మహిళను పోలీసులకు అప్పగింత

జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు క్యూ లైన్‌లో వేచి ఉండి దర్శనానికి వెళ్లే సమయంలో ఓ మహిళ పర్సును గుర్తు తెలియని మరో మహిళ కొట్టేసింది. బాధితులు దొంగను గుర్తించి పట్టుకుని.. పోలీసులకు అప్పగించారు. పిటిషన్ తీసుకున్న ఎస్ఐ వెంకటస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి దొంగతనం జరిగిన స్థలంలోని సీసీ ఫుటేజ్ పరిశీలన చేసిన తర్వాత పూర్తి సమాచారం అందిస్తామని ఎస్ఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాణ్యమైన భోజనం అందించాలి

- మండల విద్యాధికారి బాణం విష్ణు



పెద్దమందడి , నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనం శుచి శుభ్రత పాటించేలా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం ఇన్‌చార్జి ఉపాధ్యాయులదే బాధ్యత ఉంటుంది. అలాగే ఉపాధ్యాయులు కూడా సహకరించాలని మండల విద్యాధికారి బాణం విష్ణు ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూలో తెలియజేశారు.

నాణ్యమైన భోజనం అందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

మండలంలో విద్యార్థులకు శుచి, శుభ్రతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని, ఈ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. విద్యార్థులకు వడ్డించే ముందే ఒక ఉపాధ్యాయుడు కొద్దిగా మధ్యాహ్న భోజనం తీనాలని, ఆ తరువాతే విద్యార్థులకు వడ్డించాలి.

పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే మండలాన్ని మొదటి స్థానంలో నిలపడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు.?

పదో తరగతి ఫలితాలల్లో జిల్లాలోనే మండలాన్ని మొదటి స్థానం నిలబెట్టడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల తల్లి దండ్రులతో మాట్లాడుతున్నాం. విద్యార్థులకు సహకరించాలి కోరుతున్నాం. ప్రత్యేక దృష్టి సారించాలని తెలియజేస్తున్నాం.

రోజు వారీగా పాఠశాలల తనిఖీలు నిర్వహిస్తున్నారా?

ప్రస్తుతం రోజూ రెండు పాఠశాలలను తనిఖీ చేస్తున్నాం. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్నాం. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వారితో మాట్లాడి నాణ్యమైన భోజనం అందించాలని సూచిస్తున్నాం.

నాణ్యత లేని బియ్యం, పురుగుల బియ్యం వస్తే ఎలా చర్యలు తీసుకుంటున్నారు?

మండలానికి కొత్తకోట స్టాక్ పాయింట్ నుంచి ఇప్పటి వరకు నాణ్యమైన బియ్యం వస్తున్నాయి. పురుగుల బియ్యం వస్తే ప్రధానోపాధ్యాయులు గుర్తించి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చి వెనుక్కు పంపించాలి.

పాఠశాలలో పారిశుధ్య పనులు ఎలా చేపడుతున్నారు.?

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పాఠశాల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఒక స్కావేంజర్‌ను నియమించారు. వారే పాఠశాలలో పారిశుధ్య పనులు చేస్తున్నారు. పాఠశాల గదులు, పాఠశాల ఆవరణ ఊడ్చడం, మరుగుదొడ్లు శుభ్రపరచడం వంటి పనులు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

అయ్యప్ప పడి పూజకు ఎమ్మెల్యే హాజరు



పూడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని సాగర కాలనీలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్ నాయుడు గురుస్వామి ఇంట్లో ఏర్పాటు చేసిన పడి పూజ కర్యక్రమానికి ఆదివారం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారి పూజలో పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ముత్తు కృష్ణ గురుస్వామి ఎమ్మెల్యేను వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి గురుస్వామి, అశోక్ రెడ్డి గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం


పాన్‌గల్, నవంబరు24, (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన తెలుగు రాములు ఇంటి ఎదుట పశుగ్రాసాన్ని కుప్పగా ఏర్పాటు చేసుకున్నాడు. రోజు మాదిరిగా కూలీ పనుల నిమిత్తం వ్యవసాయ పొలానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు గడ్డిలో మంటలు వస్తున్నాయని రాములుకు పలువురు సమాచారం ఇచ్చారు. కూలీ పని నుంచి ఇంటికి వచ్చి చూడగా.. అప్పటికే పూర్తిగా కాలిపోయింది. దాదాపు రెండు ట్రాక్టర్లకు పైగా పశుగ్రాసం ఉందని, ప్రమాదవశాత్తు కాలి బూడిద కావడంతో ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెబ్బేరు / శ్రీరంగాపురం, నవంబరు24, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మండలాలకు చెందిన 27 మంది బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. ఉమ్మడి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన బాధితులు శస్త్ర చికిత్సల ఖర్చుల నిమిత్తం పెబ్బేరు మండలానికి సంబంధించిన రూ.32 లక్షల 25వేల చెక్కులను పంపిణీ చేశారు. శ్రీరంగాపురం మండలానికి సంబంధించిన బాధితులకు 34లక్షల 3,400 విలువ చేసే చెక్కులను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎం. రాజేంద్రప్రసాద్‌యాదవ్, గౌని బిచ్చారెడ్డి, రాజశేఖర్, వెంకట్‌రాములు, బి.రాములుయాదవ్, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు నీరు పారేదెలా?

- కాల్వకు మరమ్మతు లేక ఇబ్బందులు
- కిలోమీటరు మేర ధ్వంసమైన 32 డిస్ట్రిబ్యూటర్ వన్‌ఆర్ కాల్వ



మియ్యాపూర్ తండా సమీపంలోని ధ్వంసమైన 32 డిస్ట్రిబ్యూటర్ వన్‌ఆర్ జూరాల కాల్వ

చిన్నంబావి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మియ్యాపూర్ తండా సమీపంలోని 32 డిస్ట్రిబ్యూటర్ వన్‌ఆర్ జూరాల కాల్వ ధ్వంసమైంది. దీంతో ఇక్కడి రైతుల పొలాలకు నీళ్లు పారడంతో వరి పంటను కోసుకోవడానికి ఇబ్బందిగా ఉందని, ఎత్తు ప్రాంతంలోని రైతుల పొలాలకు నీళ్లు పారడం ఇబ్బందిగా మారింది. సుమారు కిలోమీటర్ మేర కాల్వ దెబ్బతినడంతో సమీపంలోని రైతులు పంట పొలాలను, తడపడానికి నానా అవస్థలు పడుతున్నారు. కాల్వ పూర్తిగా శిథిలమై గడ్డితో నిడిపోవడంతో నీళ్లు ముందుకు కదలట్లేదు. దీంతో కాల్వలో నీటిమట్టం పెరిగి చుట్టు పంట పొలాల గేట్లు. ధ్వంసమై కాల్వ లైనింగ్‌తో పాటు మట్టి కొట్టుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వ శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్నిచోట్ల కాల్వలో నీరు పంట పొలాలకు పారే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు తమ భూముల వద్దే కాల్వ పారుతున్నా.. పొలాలను తడుపుకొనే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

మరమ్మతులు పూర్తి చేయాలి

డి-32 డిస్ట్రిబ్యూటర్ కాల్వకు మరమ్మతు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మూడేళ్లుగా అధికారులకు విన్నవించుకుంటున్నా.. పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కాల్వ మరమ్మతులు చేసి రైతులకు ఉపయోగంలోకి తీసుకురావాలి.

- రాత్లావత్ నరసింహ, మియాపూర్ తండా

ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..

డి-32 డిస్ట్రిబ్యూటర్ కెనాల్‌కు మరమ్మతులు చేయకపోవడంతో దిగువ రైతులు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు కొలతలు చేసి వదిలేస్తున్నారు. మూడేళ్లుగా నానా ఇక్కటకు గురవుతున్నాం.

- కోట్ల నరసింహ్మ,బెక్కెం గ్రామం

చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించాలి



ఖిల్లాఘణపురంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బాల సంస్కార కేంద్రాల విద్యార్థులు

ఖిల్లాఘణపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే బాల సంస్కార కేంద్రాలతో చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించాలని విశ్రాంత ఎస్పీ మేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో ఆదివారం విశ్వహిందూ పరిషత్ ప్రముఖులతో కలిసి విద్యార్థులు ర్యాలీ నిర్వహించి భారత్ మాతాకీ జై అనే నినాదాలతో హోరెత్తించారు. మండల కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మండల పరిధిలోని 5 బాల సంస్కార కేంద్రాల చిన్నారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో విశ్రాంత ఏఎస్పీ మేరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. చిన్నారుల్లో దేశభక్తిని పెంపొందించడం ప్రతీఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి వారంలో ఒక రోజు చిన్నారులకు దేశభక్తి ధర్మం గురించి వివరించి సనాతన ధర్మాన్ని కాపాడాలని అన్నారు. విద్యార్థులకు నీతి కథలు దేశభక్తి గీతాలు భగవద్గీత శ్లోకాలు కంఠస్థం చేయించాలన్నారు. బాల సంస్కార కేంద్రాల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు పోయి కాడి చెన్నయ్య బహుమతులు అందజేశారు. ఆత్మీయ సమ్మేళన సమావేశానికి దాతలు ఎస్‌ఎల్ మురళి కృష్ణ, ప్రకాష్ సేవలందించారని విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ గౌరవ అధ్యక్షుడు గిండ్ల రాములు, విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ రాచాల జనార్దన్, శేషాచార్యులు, వెంకటరమణ, శ్రీను, బెస్త ఆంజనేయులు, కొండారెడ్డి, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలి



విద్యార్థిని అభినందిస్తున్న చిన్నారెడ్డి

వనపర్తి రూరల్ , నవంబరు24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభను మరింత కనబరచాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోని పెద్దగూడెం శివారులో గల రేడియంట్ హై స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈనెల 21, 22, 23న సూర్యచంద్ర హై స్కూల్లో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థి అభ్యుదయ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఇతర పోటీ పరీక్షల్లో ఇప్పటి నుంచే పోటీ పడాలని అప్పుడే భవిష్యత్తులో ప్రతిభ కనబరిచే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మనసుల మధ్య కాదు చదువుపైనే ఉండాలని అన్నారు. అనంతరం కళాశాల యజమాని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గద్దె కౌసల్య , గైడ్ టీచర్ విజయభాను, శ్రీరంగాపురం జడ్పీటీసీ రాజేంద్రప్రసాద్, భాస్కర్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశమైన రైతు, కార్మిక సంఘాల నాయకులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య డిమాండ్ చేశారు. రైతు, కార్మికుల జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణ ఆపాలని కోరుతూ ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆయన రైతు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. రైతు పండించిన పంటల ఖర్చుకు 50 శాతం కలిపి చట్టబద్ధత మద్దతు ధరలను ప్రకటించాలన్నారు. నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని కాంట్రాక్టు విధానాన్ని నిషేధించాలని తెలిపారు. తక్షణమే రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. రక్షణ, రైల్వే, ఆరోగ్యం, విద్య, విద్యుత్‌ను ప్రైవేటీకరించవద్దన్నారు. భూ సేకరణ చట్టం 2013ను, అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు. దళితుల గిరిజన, మైనార్టీ, మహిళలపై జరుగుతున్న కిరాతకమైన దాడులను, హత్యలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 26వ తేదీన చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆత్మకూరులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలో త్రైత సిద్ధాంతం భగవద్గీత ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడారు. కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం, అందులోని జ్ఞానం ప్రతీఒక్కరు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మనిషి మట్టి శరీరంతో సమానమని, మట్టి ప్రమిదలను పూర్వం వాడేవారని గుర్తు చేశారు. జీవితంలో ఒక్కసారి అయినా త్రైత సిద్ధాంత భగవద్గీత చదివితే మానవ జన్మ సార్థకం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్ర, జ్యోతి, శైలజ, రామచంద్రయ్య పలువురు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఎంపిక

ఖిల్లాఘణపురం, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారెడిపల్లిలో ఆదివారం బీజేపీ బూత్ కమిటీలను ఎంపిక చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ తెలిపారు. అప్పారెడ్డిపల్లిలోని 17, 18 బూత్ కమిటీ సమావేశాన్ని బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించి కమిటీ సభ్యులు గ్రామానికి చెందిన విష్ణు, చిన్నయ్య, రాము ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. విక్రమ్ రెడ్డి, ఈదమ్మ, కేశన్న, వెంకటేష్, గోపి, ముదిరాజ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కమిటీ ఎన్నిక

చిన్నంబావి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బెక్కెం (పెద్ద బిల్కు)లో గ్రామ రైతు కమిటీ ఎన్నిక గామంలోని పలు అభివృద్ధి పనులకు. కమిటీని ఎన్నుకున్నారు. రైతు కమిటీ అధ్యక్షుడిగా జే. శ్రీను, ఉపాధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శిగా కమల్ పాష, క్యాషియర్‌గా శేఖర్ యాదవ్, సెక్రటరిగా అంజిని ఎన్నుకున్నారు. గామస్థులు, యువకులు పాల్గొన్నారు,

జైగౌడ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

పెబ్బేరు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వనపర్తి జిల్లా జైగౌడ ఉద్యమ సంఘం అధ్యక్షుడిగా నియామకమైన సూగూరు మాజీ సర్పంచ్ కె.రాజశేఖర్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సన్మానించారు. ఆదివారం పెబ్బేరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెక్కుల పంపిణీ చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రాములు, రాములుయాదవ్, సహదేవుడు, కృపాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, గోవిందు, హరిబాబు, రాజునాయక్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు జర్నలిస్టు కాలనీలో ఓ విలేకరి గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పాల్గొన్నారు. అనంతరం మిగితా విలేకరులు నిర్మించుకున్న ఇళ్లను చిన్నారెడ్డి పరిశీలించారు.

కరాటే మాస్టర్‌కు సన్మానం



సన్మానం పొందిన కరాటే మాస్టర్

పెబ్బేరు, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరుకు చెందిన కుంపు కరాటే మాస్టర్ నలవాల విజయ్, ఆల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా దళిత జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు కాసేపాగు జాన్ పెబ్బేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలవర్ధన్, కుంపు కరాటే మాస్టర్ సాయి రాములు ఘనంగా సన్మానించారు. ఆత్మరక్షణ కోసం ఆరోగ్యానికి కరాటే ఎంతో అవసరమని అన్నారు. అనేక మంది విద్యార్థిని విద్యార్థులకు కరాటే యద్ద విద్యలు నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు మంచి పునాది చేస్తున్న మాస్టర్ విజయ్‌ను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో దళిత జర్నలిస్టు ఫోరం మండల అధ్యక్షుడు గాడిమూడి మన్యం, మండల రాష్ట్ర నాయకులు స్వామి, జర్నలిస్టులు మధుసూదన్‌గౌడ్, భాషా, రంజిత్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మదనాపురం, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రేషన్ బియ్యంతో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా ఆగి ఉన్న వాహనాన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాన్ని తనిఖీ చేయగా.. వాహనంలో 25 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయి. డ్రైవర్‌ను మదనాపురానికి చెందిన వెంకటేష్‌గా గుర్తించారు. సివిల్ సప్లయ్ అధికారి వేణు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



వీపనగండ్లలో ఓటు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కృష్ణమూర్తి

వీపనగండ్ల, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కును నమోదు చేయించుకోవాని నయబ్ తహసీల్దార్ కృష్ణ మూర్తి కోరారు. ఆదివారం మండల పరిధిలోని కల్వరాల ప్రభుత్వ పాఠశాలలో ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అన్ని గ్రామాల్లో ఓటు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు దరఖాస్తు చేసుకోవచ్చని, పేర్లు మార్చుకునే అవకాశం ఉందని తెలిపారు.



అమరచింత మండలం నాగల్‌కడుమూర్‌లో..

అమరచింత : యువతీ యువకులు ప్రతీఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం ఓటర్ల దినోత్సవంలో భాగంగా మండల పరిధిలోని నాగల్‌కడుమూర్‌లోని పీఎస్ నెంబర్ 248. 249ను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటు వజ్రాయుధం లాంటిదని అన్నారు.

రైతు సదస్సును విజయవంతం చేయాలి



కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న వేముల శ్రీనివాస్‌రెడ్డి

పెద్దమందడి, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌లో ఈనెల 30న కొనసాగనున్న రైతు సందస్సుకు రైతులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని అల్వాల, పెద్దమందడి, మణిగిల్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను సింగిల్‌విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఈ నెల 28న ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించనున్నారని అన్నారు. అలాగే ఈ నెల 30న సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల్ల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని అన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పంప్ కంపెనీలు నూతన ఆవిష్కరణలు, రైతులక ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పత్తుల స్టాళ్లను అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు, వాటిని అన్నింటిని ప్రదర్శనలో ఉంచుతారని అన్నారు. రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా సదస్సు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ సత్యారెడ్డి, పెంటన్నయాదవ్, నరేష్‌కుమార్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

పెబ్బేర్ రూరల్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని విక్రయించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని పెబ్బేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని రైతులకు సూచించారు. ఆదివారం మండలంలోని సుగూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధరను కల్పించి కొనుగోలు చేస్తుందన్నారు.

కార్యక్రమంలో మార్కెట్ కమి టీ వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, డైరెక్టర్ నరసింహనాయుడు, శ్రీనివాసులు. అంజనేయులు, రైతులు మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలి

అమరచింత, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికులకు తక్షణమే ప్రభుత్వం పెండింగ్ బిల్లులను అందజేయాలని ప్రగతిశీల మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెల బిల్లులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అన్నారు. ఇప్పటికే గుడ్డు బిల్లు అనేక నెలలుగా ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని అన్నారు. కాని వారికి రావాల్సిన బిల్లుల గురించి ఆలోచించడం లేదని అన్నారు. తక్షణమే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి పెండింగ్ బిల్లును అందజేయాలని కోరారు.

మతోన్మాద శక్తుల నుంచి రక్షించుకుందాం



జిల్లా సదస్సులో అభివాదం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 24: మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకుందామని సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్), మాస్ లైన్ పార్టీలకు చెందిన వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో మతోన్మాద వ్యతిరేక జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. శ్రామికుల ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు, మత సామరస్యాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మత ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ మనుషులను మనుషులుగా చూడకుండా, మతం పేరుతో మనుషులను విడదీస్తామనే ధోరణితో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి నిధులు తీసుకురావడం మరిచి, ప్రజల మధ్య మత విభజనపెంచడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎండీ జబ్బార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి హనుమంతు, అరుణ్‌కుమార్, బాల్‌రెడ్డి, రమేష్, లక్ష్మి, రాజు, గోపి, కళావతమ్మ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రారంభం



ఆత్మకూరులో డేటా ఎంట్రీ చేస్తున్న సిబ్బంది

ఆత్మకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే పూర్తి చేసుకుని ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ ప్రారంభించినట్లు ఆత్మకూరు మండల పంచాయతీ అధికారి శ్రీరామ్ రెడ్డి తెలిపారు. ఆత్మకూరు మండలంలో ఆదివారం నాటికి సమగ్ర సర్వే పూర్తి చేసుకున్నామని తెలిపారు. దీంతో 40 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించగా ఆదివారం ఎనిమిది మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు డేటా ఎంట్రీ ప్రారంభించారని తెలిపారు. ఇప్పటి వరకు 250 కుటుంబాల డేటా ఎంట్రీ ఆన్‌లైన్‌లో పొందుపరిచామని తెలిపారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ఆపరేటర్లను కేటాయించి వారం రోజుల్లో డేటా ఎంట్రీ పూర్తి చేయనున్నామని ఆయన తెలిపారు.

కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో బడి చదువులు



చదువుకుంటున్న విద్యార్థులు



పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన పైకప్పు

వనపర్తి రూరల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని దత్తాయి పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ప్రమాదంలో చదువుకుంటున్నారు. కొంత కాలంగా ప్రభుత్వ పాఠశాల భవనం పైకప్పు శిథిలావస్థకు చేరింది. ప్రతీరోజు విద్యార్థులు చదువుకుంటున్నా... గదిలోనే పైకప్పు బెచ్చులు రాలి కింద పడుతున్నాయి. కొంతకాలంగా పిల్లలు చదువుకుంటూ ఉన్నప్పుడు ఒక్కోసారి పైనుంచి పెచ్చులు రాలి కింద పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, వెంటనే బడిలో చదువుకుంటున్న పిల్లలను ప్రమాదం బారినపడకుండా చూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతం



హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

వనపర్తి రూరల్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) పరీక్ష లు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమై 12 గంటల 30 నిమిషాలకు ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పరీక్షకు రాసేందుకు ఉదయం ఎనిమిది గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, చాణిక్య హై స్కూల్లో పరీక్ష సెంటర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకు ండా పరీక్ష కేంద్రం దగ్గర హాల్ టికెట్ నెంబర్‌ను బోర్డుపై ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలకు 593 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 564 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 20 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలను ఎప్పటికప్పుడు ఎంఈవోలు మద్దిలేటి, జయశంకర్ పరీక్షల నిర్వహణ అధికారి గణేష్ లు పరిశీలించారు.